# నత్తనడకన కొనుగోళ్లు

- ఎక్కడికక్కడే ధాన్యం కుప్పలు
- ధాన్యం తూకంలో తీవ్ర జాప్యం
- కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు
- వాతావరణ మార్పులతో ఆందోళన
- కేంద్రాల్లో కనిపించని వసతులు


నిజాంపేట: స్థానిక సబ్ మార్కెట్ యార్డులో వర్షం కారణంగా తడిసిన ధాన్యాన్ని నీళ్ల నుంచి వేరు చేస్తున్న మహిళ


మెదక్ మండలం మక్తభూపతిపూర్‌లో పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ఎక్కడికక్కడ ఉన్న వడ్ల కుప్పలు

మెదక్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటివరకు కేవలం 600 మంది రైతుల నుంచి 3059.24 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఈ ధాన్యం విలువ రూ.6.74 కోట్లు మాత్రమే. ఇందులో కేవలం రూ.24 లక్షల డబ్బులు మాత్రమే రైతులకు చెల్లించారు. జిల్లాలో మొత్తం 410 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశారు. కానీ, కొనుగోలు కేంద్రాల్లో ఇంకా పూర్తిస్థాయిలో కాంటాలు కావడం లేదు. వాతావరణంలో మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తున్నది.

### దళారులదే రాజ్యం..

ఇదే అదునుగా భావించిన దళారులు ధాన్యాన్ని తక్కువ ధరకు కొంటున్నారు. ప్రభుత్వం క్వింటాలు ధాన్యానికి రూ.2,203 మద్దతు ధర నిర్ణయించగా, దళారులు మాత్రం రూ.2,050 పెట్టి కొంటున్నారు. 50 కిలోలకు 2 కిలోల ధాన్యాన్ని తరుగు తీస్తున్నారు. క్వింటాల్‌కు 4 కిలోల వడ్లతోపాటు మద్దతు ధర కంటే రూ.153 తక్కువ చెల్లిస్తున్నారు. పది రోజుల్లో డబ్బులిస్తామని చెప్పి, రోజులు గడుపుతూ నెల రోజుల వరకు రైతులకు డబ్బులు చెల్లించడంలేదు. కొనుగోలు కేంద్రాల వద్ద 17 తేమ శాతంతో వడ్లను కొనుగోలు కేంద్రాల్లో తూకం వేస్తున్నా, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో కుమ్మక్కై రైస్‌మిల్లర్లు 40 కిలోల బస్తాకు 2.5 కిలోల వడ్లను అదనంగా ప్రతి క్వింటాలుకు 5 కిలోల తరుగును తీస్తున్నారు.

### ఎక్కడి కుప్పలు అక్కడే...

జిల్లావ్యాప్తంగా వరి కోతలు జోరందుకున్నాయి. ఎక్కడి వడ్లు అక్కడే ఉన్నాయి. ఈ సీజన్‌లో 4.20 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. వరి కోతలు మొదలైనా కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి కానందున వడ్ల కుప్పలు ఎక్కడికక్కడే ఉన్నాయి. తూకం వేసి రవాణా చేసే దాకా రైతులకు తిప్పలు తప్పడంలేదు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం క్షేత్ర స్థాయిలో జరుగుతున్న మోసాలు, అక్రమాలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

### కనిపించని కనీస సౌకర్యాలు

జిల్లాలో 410 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఏ ఒక్క కొనుగోలు కేంద్రంలో టెంట్లు, తాగునీటి వసతి, కూలీల కోసం షెడ్డు ఏర్పాటుచేయలేదు. ఎండలు మండిపోతుండడంతో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. సౌకర్యాలు కల్పించక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. 1.05 కోట్ల గన్నీ బస్తాలు అవసరం ఉండగా, 47.46 లక్షల బస్తాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

### తడిసిన ధాన్యంతో ఆందోళనలో రైతన్న

నిజాంపేట, ఏప్రిల్ 18: నిజాంపేట మండల వ్యాప్తంగా బుధవారం రాత్రి బలమైన ఈదురు గాలులతో కురిసిన వర్షానికి చేతికొచ్చిన పంట నేలకొరిగింది. కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యం తడిసిపోయింది. అడుగంటిన భూగర్భజలాలు, కరెంట్ సమస్యలు, అకాల వర్షాలతో రైతులు నష్టల బారిన పడుతున్నారు.

## ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

### తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి


యంత్ర ప్రతిష్ఠ చేస్తున్న మాధవానంద సరస్వతీ స్వామీజీ, హాజరైన భక్తులు

రామాయంపేట, ఏప్రిల్ 18: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామీజీ అన్నారు. గురువారం మండలంలోని రాయిలాపూర్ గ్రామంలో నిర్మించిన ఆలయంలో భవానీ రామలింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, యంత్ర ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని స్వామీజీ చేపట్టారు. కార్యక్రమంలో పురోహితుడు వేలేటి లక్ష్మణశాస్త్రి, రామ్మోహనశర్మ, మాజీ సర్పంచ్ భూమగారి నర్సాగౌడ్, ఎంపీటీసీ సార్గు భాగ్యమ్మ భిక్షపతి, రమేశ్, కుమారస్వామి ఉన్నారు.

## కరాటేలో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ


విద్యార్థినులకు బెల్టులు అందజేస్తున్న నగేశ్

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 18: రెంజుకీ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో గురువారం నిర్వహించిన కరాటే పోటీల్లో 50 మంది విద్యార్థినులు పలు విభాగాల్లో బెల్టులు సాధించినట్లు మాస్టార్ రియాజ్ తెలిపారు. ఇందులో అత్యధికంగా కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు ఉన్నారన్నారు. బెల్టులు సాధించిన విద్యార్థినులకు రెంజుకీ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు నగేశ్ బెల్టులు అందజేశారు.

## జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ చాటాలి


మనోహరాబాద్‌లో సాఫ్ట్‌బాల్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

మనోహరాబాద్, ఏప్రిల్ 18: యువత జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించాలని స్కూల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు శోభన్‌బాబు, అజయ్‌కుమార్, ఎంపీటీసీ లతావెంకట్‌గౌడ్, సీఐ రవి, ఎస్సై హరీశ్ అన్నారు. మనోహరాబాద్‌లోని తెలంగాణ క్రీడా ప్రాంగణంలో మూడో జూనియర్ సౌత్‌జోన్ నేషనల్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ 2023-24 సెలక్షన్స్‌ను గురువారం ప్రారంభించారు. తెలంగాణలోని 16 జిల్లాలో ఒక్కో జిల్లా నుంచి ఆరుగురు బాలికలు, ఆరుగురు బాలురను ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. మొత్తం 110 మందికిపైగా శిక్షణా శిబిరానికి హాజరయ్యారన్నారు. వీరికి పోటీల్లో నైపుణ్యం పెంపొందించడంతో పాటు ఆటలో మెళకువలపై శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన 25 మందిని ఎంపిక చేసి, ఈ నెల 28 నుంచి కర్ణాటకలో జరిగే సాఫ్ట్‌బాల్ పోటీల్లో 16 మంది పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి రేణుక, నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొడిప్యాక నారాయణగుప్తా, సెక్రటరీలు శ్యామ్ సుందర్‌శర్మ, గోవర్ధన్, కోచ్ రవి, సభ్యులు కుమార్‌గౌడ్, సురేశ్, వెంకట్‌రెడ్డి, కృష్ణ, శ్రీనివాస్, సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

## రేపు కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు నామినేషన్


నర్సాపూర్‌లో మాట్లాడుతున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్, ఏప్రిల్ 18: మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ఈ నెల 20న నామినేషన్ వేయనున్నట్లు పీసీసీ ప్రధాన కార్యదర్శి, పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. నామినేషన్ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర రాజనరసింహ, కొండా సురేఖ తదితరులు హాజరు కానున్నారని తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, ఎంపీ పీ జ్యోతిసురేశ్‌నాయక్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరికలు


కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్, ఏప్రిల్ 18: మండలంలోని గూడెంగడ్డ గ్రామ వార్డు సభ్యులు, ఎల్లాపూర్ గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతో పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం, మాజీ ఎంపీపీ లలిత, నాయకులు సురేశ్, హబీబ్‌ఖాన్ ఉన్నారు.

## నేడు ఆర్.వెంకటాపూర్‌కు బక్కి వెంకటయ్య రాక

రామాయంపేట, ఏప్రిల్ 18: మండలంలోని ఆర్.వెంకటాపూర్ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన విషయం తెలియడంతో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శుక్రవారం రానున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గర్గుల శ్రీనివాస్ తెలిపారు. చైర్మన్ రాక సందర్భంగా జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలు భారీగా ఆర్.వెంకటాపూర్ గ్రామానికి చేరుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయనతో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు స్వామి, పట్టణ అధ్యక్షుడు ఏసురాములు, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.


రామాయంపేటలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గర్గుల శ్రీనువాస్

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు


మాట్లాడుతున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

మెదక్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కోరారు. నీలం మధు తరపున ఒక సెట్ నామినేషన్ పత్రాలను ఎమ్మెల్యే కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారికి బుధవారం అందజేశారు. అనంతరం మెదక్ మండలం మాచవరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వంద రోజుల్లో మెదక్ నియోజకవర్గాన్ని బాగా అభివృద్ధి చేశామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలు అమలుచేస్తారన్నారు. ఈ నెల 20న ఎంపీ అభ్యర్థి నీలం మధు నామినేషన్ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి మెదక్‌కు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, నాయకులు వెంకటరమణ, బొజ్జ పవన్, ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, దేమ యాదగిరి, మహేందర్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

పాపన్నపేట, ఏప్రిల్18: మండలంలోని గాంధారిపల్లి గ్రామానికి చెందిన రంగమొల్ల సంజీవరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మృతుడి కుంటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే రోహిత్‌రావు తెలిపారు. గురువారం గాంధారిపల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం పాపన్నపేటలో కాంగ్రెస్ కార్యకర్త వివాహంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట నాయకులు ప్రశాంత్‌రెడ్డి, గోవింద్ నాయక్ ఉన్నారు.

## ఎఫ్‌టీఎల్ శిఖం భూమిని కాపాడాలని వినతి

మనోహరాబాద్, ఏప్రిల్ 18: మండలంలోని రామాయిపల్లి పెద్ద చెరువు, చిన్న చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) శిఖం భూమిని కాపాడాలని ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సంఘం సభ్యులు, ముదిరాజ్‌లు తహసీల్ కార్యాలయంలో గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ శివారులోని పెద్ద, చిన్న చెరువు, పోతరాజుకుంట, పెద్దమ్మకుంట ఆక్రమణకు గురవుతున్నాయన్నారు. ఎఫ్‌టీఎల్ శిఖం భూమిలో యథేచ్ఛగా కట్టడాలు నిర్మిస్తున్నారని, వెంచర్లుగా చేసి విక్రయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాత్రి వేళల్లో మట్టిని నింపి చెరువు ఆనవాలు లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మనోహరాబాద్ మురుగు నీరు వచ్చి చేరుతుండడంతో మత్స్య సంపదకు అపార నష్టం వాటిల్లుతున్నదన్నారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి మత్స్యకార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

## హార్వెస్టర్‌పై నుంచి కింద పడి వ్యక్తి మృతి

పాపన్నపేట, ఏప్రిల్ 18: హార్వెస్టర్‌పై నుంచి కింద పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాంధారిపల్లిలో గురువారం జరిగింది. ఎస్సై నరేశ్ కథనం మేరకు.. పంజాబ్ రాష్ట్రానికి చెందిన సుర్జిత్‌సింగ్(49) మూడు నెలల నుంచి నిజామాబాద్ జిల్లాలోని ఓ వ్యక్తి వద్ద హార్వెస్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గాంధారిపల్లికి హార్వెస్టర్‌ను తీసుకొచ్చి గ్రామ శివారులో బుధవారం సాయంత్రం పంట కోశాడు. రాత్రి సమయంలో భోజనం చేయడానికి వరికోత యంత్రంపైకి ఎక్కాడు. అక్కడ కూర్చొని భోజనం చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడే ఉన్న యంత్రం హెల్పర్ సజన్ స్థానికులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని మెదక్ ఏరియా దవాఖానకు తరలించారు. సహాయకుడు సజన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

## ఆత్మహత్య చేసుకుంటానని సెల్ఫీ వీడియో

- పోలీసుల సహకారంతో గాలింపు చర్యలు

అల్లాదుర్గం, ఏప్రిల్ 18: బంధువులు మోసం చేశారని ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సెల్ఫీ వీడియో తీసి మండలం, గ్రామ వాట్సప్ గ్రూప్‌ల్లో పెట్టడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు భయాందోళనకు గురైన ఘటన ముస్లాపూర్ గ్రామంలో చోటు చేసుకున్నది. గురువారం ముస్లాపూర్ గ్రామానికి చెందిన ఇప్ప వంశీకి అప్పుల బాధలు ఎక్కువయ్యాయి. దీంతో మనస్తాపానికి గురైన వంశీ ఆత్మహత్య చేసుకుంటానని 15 రోజులుగా చెప్తున్నాడు. గ్రామంలో దుర్గమ్మ జాతర ఉండడంతో మరోసారి సెల్ఫీ వీడియో తీసి ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు వాట్సప్ గ్రూప్‌లో పెట్టాడు. దీంతో గ్రామంలోని ప్రజలు, కుటుంబ సభ్యులు, స్నేహితులు భయాందోళనకు గురై చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. అయినా ఫలితం లేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ప్రవీణ్‌రెడ్డి సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. ముస్లాపూర్ గ్రామ శివారులోని చెరువు వద్ద యువకుడిని పట్టుకుని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

## సేవ చేసే అవకాశం ఇవ్వండి

- తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుని నామినేషన్ వేసిన రఘునందన్‌రావు


నామినేషన్‌కు ముందు తల్లిదండ్రులతో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

మెదక్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): మెదక్ ప్రజలకు సేవ చేసే అవకాశం ఇవ్వాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. గురువారం నామినేషన్ దాఖలుకు ముందు తల్లిదండ్రులు భగవంత్‌రావు, భారతిల ఆశీర్వాదం తీసుకున్నారు. ఆ తర్వాత కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, గోదావరి అంజిరెడ్డి, పంజా విజయ్‌కుమార్, సంగమేశ్వర్‌తో కలసి నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికార బలంతో కొన్ని స్వార్థశక్తులు కుట్రలు పన్నుతున్నారన్నారు. మోదీకి జన బలం ఉన్నదని, మూడోసారి గెలిచి దేశాన్ని మరింత అభివృద్ధి చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. ఆయనతో మోహన్‌రెడ్డి, ఎక్కల్‌దేవి మధు ఉన్నారు.

## ప్రతిదీ క్షుణ్ణంగా పరిశీలించాలి

- జిల్లా వ్యయ పరిశీలకుడు సునీల్‌కుమార్ రాజ్ వాన్ని
- ఎంసీఎంసీ మీడియా సెంటర్, నర్సాపూర్, శివ్వంపేటలో పరిశీలన



మెదక్‌లో ఎంసీఎంసీ మీడియా సెంటర్‌ను పరిశీలిస్తున్న సునీల్ కుమార్ రాజ్ వాన్షి

మెదక్, ఏప్రిల్ 18(నమస్తే తెలంగాణ): ఎన్నికల నియమావళిలో భాగంగా కలెక్టరేట్‌లోని ఎంసీఎంసీ మీడియా సెంటర్‌ను వ్యయ పరిశీలకుడు సునీల్‌కుమార్ రాజ్ వాన్షి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి గురువారం పరిశీలించారు. జిల్లాలో చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల రికార్డింగ్ పనితీరును పరిశీలించారు. విజిల్‌లో వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారాలు, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ టీమ్ పనితీరు, మీడియాలో వచ్చే వార్తలు, పెయిడ్ న్యూస్, పత్రికా ప్రకటనలు, ఎలక్ట్రానిక్ మీడియా రికార్డింగ్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు అకౌంట్ సమాచారం, ఒకేసారి పెద్ద మొత్తంలో డబ్బు జమైన సమాచారం, వాటి వివరాలు, జీఎస్‌టీ అకౌంట్ల వివరాలు, ఇప్పటివరకు సీజ్ అయినా డబ్బు, మద్యం, నమోదైన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో నోడల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

### నర్సాపూర్‌లో..

నర్సాపూర్, ఏప్రిల్ 18: ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు సునీల్‌కుమార్ రాజ్ వాన్షి ఆదేశించారు. గురువారం నర్సాపూర్ మల్లన్న గుడి, శివంపేట్ మండలంలోని శభాష్‌పల్లి ఎక్స్ రోడ్, హత్నూరా మండలంలోని మల్కాపూర్‌లో ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్ పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్లు కమలాద్రి, శ్రీనివాసచారి, ఎన్నికల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## నేడు వీరాంజనేయ విగ్రహ ప్రతిష్ఠపన

నర్సాపూర్, ఏప్రిల్ 18: మండలంలోని ఆవంచ గ్రామంలో నేటి నుంచి మూడు రోజుల పాటు వీరాంజనేయ విగ్రహం, బొడ్రాయి ప్రతిష్ఠ జరుగుతుందని నిర్వాహకులు, మాజీ సర్పంచ్ కరుణాకర్ తెలిపారు. దీనికి సంబంధించిన గోడ పత్రికను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహోత్సవానికి రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామీజీ హాజరవుతారన్నారు. గ్రామంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆవంచ గ్రామంలో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ జక్కుల వెంకటేశం రూ.10 వేలు విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శోభావిజయ్‌కుమార్, మాజీ వార్డు సభ్యుడు శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, నాగులు, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

### అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు


సీజ్ చేసిన మట్టి టిప్పర్లు

మనోహరాబాద్, ఏప్రిల్ 18: అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై కరుణాకర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమతుల్లేకుండా మట్టి రవాణా చేస్తున్న మూడు టిప్పర్ లారీలను మనోహరాబాద్ శివారులో సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### వైఎస్ఆర్ విగ్రహానికి తొలిగిన ముసుగు



చిలిపిచెడ్ (కొల్చారం), ఏప్రిల్ 18: కొల్చారం మండలం ఘనపూర్‌లో మెదక్-సంగారెడ్డి ప్రధాన రోడ్డు పక్కన వైఎస్సార్ విగ్రహానికి వేసిన ముసుగు తొలిగింది. ఎన్నికల కోడ్ ఉన్నందున నాయకుల విగ్రహాలకు నామమాత్రంగా ముసుగులు వేశారు. ముసుగు తొలిగినా పట్టించుకునే అధికారులు కరువయ్యారు.

### ప్రమాదాలపై నిర్లక్ష్యం వద్దు


ప్రయాణికులకు సూచనలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రామాయంపేట, ఏప్రిల్ 18: ప్రమాదాలపై నిర్లక్ష్యం చేయవద్దని, వాటి నివారణ చర్యలు చేపట్టాలని అగ్నిమాపక సిబ్బంది పేర్కొన్నారు. గురువారం అగ్ని మాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు వీధులతోపాటు ప్రధాన కూడళ్లలో ప్రమాదాలపై పట్టణ వాసులకు సూచనలు చేశారు. వంటలు చేసే సమయంలో చాలా జాగ్రత్తలు వహించాలన్నారు. ప్రమాదం సంభవించినప్పుడు ఎలాంటి ఆందోళన చెందకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. దవాఖానాల్లో వైద్యులు ప్రమాదం సంభ వించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. ప్రయాణికులకు ప్రమాదాలపై సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శకట ఫైర్ ఇన్‌చార్జి స్వామిరెడ్డి, చంద్రాగౌడ్, సత్తయ్య, నరెందర్, నవీన్‌గౌడ్ తదితరులున్నారు.

### డాక్యుమెంట్ పోయింది

అన్నవేని నాగరాజు (38) S/o శ్రీరాములు, గ్రామం రెడ్డిపల్లి, ఇంటి నంబర్ 2-44, మండలం చేగుంట, జిల్లా మెదక్, రెడ్డిపల్లి గ్రామ కంటం లో గల సర్వే నంబర్ 698 లోని 100.04 గజము గల ప్లాట్ కు సంబంధించిన డాక్యుమెంటు నేను రెడ్డిపల్లి నుంచి చేగుంట కు వెళ్తుండగా డాక్యుమెంట్ నంబర్ 1361/2009 గల ఒరిజినల్ డాక్యుమెంట్ పోయింది. ఎవరికైనా దొరికినచో ఇవ్వగలరు. ఫోన్: 9951941673

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
PLOT FOR SALE
★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్డు, SBI దగ్గర, 161 చ.గ. ఇంటి స్థలం అమ్మబడును. సంప్ర: 8143366630, 9989554915
NT-115
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
సిద్దిపేట/గజ్వేల్/తూప్రాన్/మెదక్ : 80966 77663
సంగారెడ్డి/జహీరాబాద్/నారాయణఖేడ్ : 9182777658
పటాన్‌చెరు : 80966 77657